# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశవ్యాప్తంగా రేపు జరగనున్న నాలుగో దశ పోలింగ్ కు సర్వం సిద్ధమైంది.
- ❖ రాష్ట్రంలో రేపు జరిగే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు.
- ❖ విశాఖ జిల్లాలో అధిక శాతం పోలింగ్ నమోదయ్యేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున విజ్ఞప్తి చేశారు.
- ❖ ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

==========================

దేశవ్యాప్తంగా నాలుగో దశ పోలింగ్‌కు సర్వం సిద్దమైంది. రేపు జరిగే ఈ దశలో మొత్తం 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆంధ్రప్రదేశ్ లో 25 స్థానాలకు, తెలంగాణ 17, బిహార్ 5, ఝార్ఖండ్ 4, మధ్యప్రదేశ్ 8, మహారాష్ట్ర 11, ఒడిశా 4, ఉత్తరప్రదేశ్ 13, పశ్చిమ బెంగాల్ 8, జమ్మూ కశ్మీర్ శ్రీనగర్ లో ఒక స్థానానికి పోలింగ్ జరగనుంది.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముకేశ్ కుమార్ మీనా వెల్లడించారు. ఈరోజు ఆయన విజయవాడలో పాత్రికేయులతో మాట్లాడుతూ, అన్ని ప్రాంతాలకు సిబ్బందిని పంపిస్తున్నామని, రాత్రి 7 గంటలకల్లా పోలింగ్ సిబ్బంది అందరూ ఆయా కేంద్రాలకు చేరుకుంటారని తెలిపారు. ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక అప్లికేషన్లు తీసుకొచ్చామని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి, పోల్ డేటా మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లో మరికొన్ని గంటల్లో పోలింగ్ ప్రారంభంకానున్న నేపధ్యంలో అత్యధికంగా అభ్యర్థులు పోటీ చేస్తున్న విశాఖ లోక్‌సభ స్థానంపై అందరూ దృష్టి సారించారు. ఈ నియోజకవర్గం నుంచి 39 మంది నామినేషన్లు వేయగా, ఆరు నామినేష్లను అధికారులు తిరస్కరించడంతో ప్రస్తుతం 33 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అదే విధంగా రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానానికి అత్యల్పంగా 12 మంది పోటీ చేస్తున్నారు. తిరుపతి శాసనసభ స్థానం నుంచి అత్యధికంగా 46 మంది పోటీ చేస్తుండగా, రంపచోడవరంలో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది, 175 శాసనసభ స్థానాలకు 2 వేల 387 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కూటమి తరుఫున టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తుండగా వైసీపీ, కాంగ్రెస్ పార్టీతో పాటు సీపీఐ, సీపీఎం వామపక్ష పార్టీలు ఒకటి, రెండుచోట్ల తలపడుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న 3 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వివిధ ప్రాంతాలలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలతో పాటు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని వెల్లడించింది. గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లో రేపు జరగనున్న పోలింగ్ కు సంబదించి సమయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా ప్రకటించారు. రాష్ట్రంలో 6 నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. భద్రత దృష్ట్యా అరకు, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటలకు, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగియనుందని, ఆ సమయంలోగా క్యూలైన్ లో ఉన్న వారికి ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. పోలింగ్ కు 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తామని వివరించారు. ఓటర్లను రాజకీయ పార్టీలు తరలించడం చట్ట వ్యతిరేకమని, అటువంటి వాటిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి ప్రిసైడింగ్ అధికారి మినహా ఓటర్లు సైతం ఫోన్లు తీసుకెవెళ్లేందుకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విశాఖపట్నం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈరోజు విశాఖలో పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో 85 శాతానికి తగ్గకుండా పోలింగ్ నమోదయ్యేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో తొలిసారి పర్యవేక్షిస్తున్నట్లు విశాఖ పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు. ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగేందుకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించిన 155 పోలింగ్ స్టేషన్లలో విధుల్లో వున్న ప్రతి కానిస్టేబుల్ కూ బాడీ ఓన్ కెమేరాలను ఇస్తున్నామన్నారు. లైవ్ లో చిత్రీకరించే ప్రతి దృశ్యం కమాండ్ కంట్రోల్ కు చేరుతుందని... తద్వారా తక్షణ ఆదేశాలు జారీ చేసి పరిస్థితులను అదుపులో ఉంచవచ్చని అన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంల తరలింపు వాటిని తిరిగి స్ట్రాంగ్ రూమ్ కి చేర్చేవరకు కమాండ్ కంట్రోల్ నుంచి ప్రత్యక్షంగా పర్యవేక్షించవచ్చని పోలీస్ కమిషనర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు మే 14న ఎన్నికల సంఘం సాధారణ సెలవును ప్రకటించింది. రేపు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక సెలవు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు. ఏపీ ఎన్జీవో, ఏపీ జేఏసీ, ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఈవో వివరించారు. ఈ ప్రత్యేక క్యాజువల్ లీవ్ సౌకర్యం పోలింగ్ విధుల కోసం కేటాయించిన రిజర్వుడు సిబ్బందికి వర్తించదని ముకేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఓటు వేసేందుకు సొంత ఊళ్లకు వెళ్ళే ప్రయాణీకుల సౌకర్యార్థం, రోజు వారీగా నడిచే సర్వీసులతో పాటు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ తెలిపింది. హైదరాబాద్ నుండి ఒంగోలు, ఏలూరు, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు, నంద్యాల, విశాఖపట్నాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. అదే విధంగా విజయవాడ నుండి విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశామని, ఈ ప్రత్యేక బస్సులు సాధారణ ఛార్జీలతోనే నడపబడతాయని అధికారులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో ఎన్నికల సామగ్రి తరలింపు విజయవంతమైందని, అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. ఈరోజు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్, సమక్షంలో ఈవీఎంల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ, ఎన్నికల సిబ్బందిని తరలించడానికి 48 బస్సులు, 88 జీపులను ఏర్పాటు చేశామన్నారు. 1,786 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని, 98 శాతం సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నియోజకవర్గంలోని 2.47 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =